
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 4 ఆగస్టు 2024 | 5





7 నుంచి భీమేశ్వరస్వామి దర్శనాలు

వార్త..7లో

నిలువెత్తుగా..

12 అడుగుల ఇసుక మేటలు

గతంలో ఎన్నడూ లేని విధంగా కూనవరం సముద్రం మొగ వద్ద 12 అడుగుల ఎత్తున ఇసుక మేటలు వేశారు. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరించారని దీనిని బట్టి అర్థమవుతోంది. డ్రెయిన్స్ ఉన్నతాధికారుల సర్వేలో విస్తుపోయే పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఎత్తు ఎక్కువగా ఉండడంతో ఇసుక మేటల తొలగింపు ప్రక్రియ మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు.

- కూనవరం సముద్రం మొగ వద్ద
- ప్రైవేటు తవ్వకాలతో భారీగా ఇసుక మేటలు
- సుమారు12 అడుగుల ఎత్తున చిన్నసైజు కొండలా..
- నేటి నుంచి నాలుగు యంత్రాలతో తవ్వకాలు
- త్వరలో డ్రెడ్జర్‌తో డ్రెయిన్‌లో పూడికతీత



ఉప్పలగుప్తం, ఆగస్టు 3:

ఇష్టారాజ్యంగా

గత కొన్నేళ్లుగా ప్రైవేటు వ్యక్తులు సొంతంగా మొగ వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఉన్నత స్థాయిలో అధికారులు సైతం ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ప్రభుత్వానికి భారం లేకుండా పనులు జరిగిపోతున్నాయని భావించారు. డ్రెయిన్స్ అధికారుల డిజైన్‌కు విరుద్ధంగా తవ్వకాలు జరపడమే ఇసుకను భారీ స్థాయిలో ఎక్కువ ఎత్తుగా మేటలు వేయడానికి కారణమని సర్వేలో తేలింది. గతంలో ఓల్డ్‌కోర్స్ వద్ద తవ్వకాలు జరిపేవారు. ఇంజనీరింగు నిపుణులు రూపొందించిన మ్యాప్ ఆధారంగా తవ్వకాలు జరగడంతో డ్రెయిన్ నుంచి సముద్రంలోకి ముంపునీటి అవుట్‌ఫ్లో, ఇన్‌ఫ్లోల ప్రవాహ వేగం సమస్థాయిలో ఉండేది. దీని వల్ల అలలకు అంతంత మాత్రంగానే ఇసుక మేటలు ఏర్పడి మొగ కొంత కాలంపాటు మూసుకుపోకుండా ఉండేది. ప్రస్తుతం పక్కా ప్రణాళికతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు ఒకే ఎక్సకవేటర్‌తో తవ్వకాలు జరుపుతున్నారు. శనివారం సాయంత్రానికి మరో మూడు లాంగ్ ఆర్మ్ ఎక్సకవేటర్‌లు మొగ వద్దకు చేరుకున్నాయి. ఈ నెల నాలుగో తేదీ నుంచి తవ్వకం పనులు వేగవంతం కానున్నాయి.

త్వరలో డ్రెడ్జర్ ఏర్పాటు

కూనవరం మేజర్ డ్రెయిన్ గట్టు రాఘవులపేట వంతెన దిగువన మొగ సమీపంలో పూర్తిగా బలహీనపడింది. ఇక్కడ డ్రెయిన్‌లో భారీగా ఇసుక, మట్టి మేటలు వేసింది. గతంలో ఇక్కడ ఎక్సకవేటర్‌తో తవ్వకాలు చేపట్టినా ఫలితం లేకపోయింది. డ్రెయిన్‌లో పూడికతీత పనులకు త్వరలో డ్రెడ్జర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. మొగ తవ్వకాల వల్ల తాత్కాలిక ప్రయోజనం చేకూరినా, డ్రెయిన్ గట్ల పటిష్టత, డ్రెయిన్లలో పూడికతీత పనులు చేస్తే రైతులందరికి ప్రయోజనముంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.



ఇసుక మేటలు తొలగిస్తున్న ఎక్సకవేటర్



కూనవరం మొగ వద్ద ఇసుకమేటలు

సూర్యఘర్‌తో వెలుగులు

- గృహ విద్యుత్ వినియోగదారుల కోసం కేంద్ర పథకం
- సబ్సిడీతో కూడిన సోలార్ రూఫ్‌టాప్ మంజూరు
- పథకం పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ మహేష్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ తదితరులు

అమలాపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం గృహ విద్యుత్ వినియోగదారుల కోసం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ కార్పొరేషన్ లిమిటెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నిర్ణయించారన్నారు. సూర్యఘర్ పథకం అమలు విధానంతో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ సౌరశక్తితో సూర్యఘర్ యూనిట్ పనిచేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలన్నారు. ఈ పథకం కేవలం గృహవిద్యుత్ వినియోగదారులకు మాత్రమేనని చెప్పారు.. నెలవారీగా రూ.వెయ్యి విద్యుత్ బిల్లులు చెల్లించే వారికి ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కిలోవాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.75 వేలు ఖర్చు అవుతుందని, దీనిలో 35 వేలు ప్రభుత్వం రాయితీగా అందిస్తుందన్నారు. రెండు కిలో వాట్లకు రూ.60 వేలు రాయితీ, మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు రాయితీ అందిస్తోందని చెప్పారు. ఈ పథకానికి సంబంధించి బై డైరెక్షన్ మీటరును అమరుస్తారని, గృహ వినియోగానికి పోను మిగిలిన యూనిట్లను గ్రిడ్‌కి అనుసంధానం చేస్తారని తెలిపారు. మూడు నెలలకొకసారి విద్యుత్ బిల్లులపై ట్రాన్స్‌కో అధికారులు సర్దుబాటు చేస్తారని వివరించారు. ఈ పథకం పొందాలనుకునేవారు ప్రధానమంత్రి సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించవచ్చునని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో కార్యనిర్వాహక ఇంజనీర్ కె.రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.అన్నవరం, ఎ.వీరభద్రరావు, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు బి.నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, నెడ్‌క్యాప్ జూనియర్ మేనేజర్ ఏఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయి గుప్పు



- అల్లవరం తీర ప్రాంతాల్లోని చాలా చోట్ల గుప్పుమంటున్న గంజాయి
- మత్తులో వివాదాలకు కేంద్ర బిందువవుతున్న యువత
- బ్రౌన్ షుగర్ కూడా వస్తున్నట్లు అనుమానాలు..



అల్లవరం మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లో చాలా చోట్ల యువత గంజాయి మత్తులో జోగుతోంది. బిహార్, ఆంధ్ర ఏజెన్సీ ప్రాంతాల నుంచి అల్లవరం మండలానికి గంజాయి తరలివస్తోంది. యువకులు, విద్యార్థులు గంజాయికి బానిసలు అవుతున్నారు..

అల్లవరం, ఆగస్టు 3:

గ్రామాలకు గంజాయి..

అల్లవరం మండలం ఓడలరేవు తుమ్మలపల్లి, కొమరగిరిపట్నం, బెండమూర్లంక గ్రామాలకు కొందరు రహస్యంగా గంజాయి సరఫరా చేసి యువకులకు అమ్ముతున్నట్లు చెప్పుకుంటున్నారు. గంజాయితో పాటు బ్రౌన్ షుగర్ కూడా వస్తున్నట్లు తెలిసింది. గంజాయి మత్తుకు అలవాటైన యువకులు చెడు వ్యసనాలకు బానిస కావడంతో తీర ప్రాంతాల్లో పలు వివాదాలు తలెత్తుతున్నాయి. అలాగే విద్యార్థులు కూడా ఈ మత్తుకు అలవాటు పడుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో మండల పరిధిలో గంజాయి అమ్మకాలకు సంబంధించి నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇటీవల కొందరు యువకులకు ఓడలరేవులో గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిపై పోలీసులకు సమాచారం అందించగా ఆ దిశలో దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి మత్తు ఇతర గ్రామాలకు పాకకుండా యువత ఈ వ్యసనానికి బానిస కాకుండా పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

---

3 నెలల్లో 8 వేల టన్నుల కొబ్బరి కొనుగోళ్లు

- ఏపీ ఆయిల్‌ఫెడ్
- సీనియర్ మేనేజర్ సుధాకరరావు



సుధాకరరావు

కొత్తపేట, ఆగస్టు 3: కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా ఆయిల్, నాఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో మూడు నెలల్లో 8వేల టన్నులు కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ణయించామని ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. శనివారం కొత్తపేటలో నాఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమలో కొత్తపేట, అంబాజీపేట, ముమ్మిడివరం, తాటిపాక, నగరంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. అంబాజీపేట, కొత్తపేటలలో ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు. అలాగే మూడు జిల్లాల పరిధిలో ఉన్న గోపాలపురంలో కూడా కొబ్బరి కొనుగోలు కేంద్రం త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆరు కొనుగోలు కేంద్రాలలో ఆయిల్‌ఫెడ్ ద్వారా సేకరించిన కొబ్బరిని నాఫెడ్‌కు అందిస్తామన్నారు. ఇందులో భాగంగా బాల్‌కొప్రా రూ.12 వేలు మిల్లింగ్ కొప్రా రూ.11,160 ధర నిర్ణయించామన్నారు. మూడు నెలల కాల పరిమితిలో 50 కేజీల 1.60 లక్షల సంచులు కొనుగోలు లక్ష్యమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ కొబ్బరి ఉత్పత్తులను కొనుగోలు కేంద్రానికి తరలించాలన్నారు. 15 రోజుల వ్యవధిలో వారికి సొమ్మును బ్యాంకు ద్వారా చెల్లిస్తామన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్లు డి.రాజేష్, వెంకట్ తదితరులు ఉన్నారు.



క్యూలో భక్తులు

శ్రీనివాసా.. గోవిందా..

7లో

భక్తజనంతో కిటకిటలాడిన వాడపల్లి

మందపల్లికి తరలివచ్చిన భక్తజనం

కొత్తపేట, ఆగస్టు 3: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,58,457 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఘనంగా ప్రారంభమైన తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరునక్షత్ర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ద్రవిడవేద పారాయణం, ప్రాకారోత్సవం, నీరాజన మంత్ర పుష్పం, అమ్మవారికి కుంకుమార్చన, బాలభోగం కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ పనులు పర్యవేక్షించారు.

ఆండాళ్ అమ్మవారికి పూజలు





రాకపోకలు ప్రారంభం

పి.గన్నవరం: పి.గన్నవరం మండలం కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. నీరు పారుతున్నప్పటికీ నడిచి వెళ్తున్నారు.

లంక గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలి

వరద ముంపు ప్రాంతాల్లో డీఎల్‌పీవో పర్యటన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో బొజ్జిరాజు

అయినవిల్లి, ఆగస్టు 3: గోదావరి వరదల ప్రభావంతో ముంపు బారినపడ్డ లంక గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని అమలాపురం డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు పంచాయతీ అధికారులను ఆదేశించారు. శనివారం అయినవిల్లి మండలంలోని ముంపు గ్రామాల్లో ఆయన పర్యటించి పారిశుధ్య చర్యలను పరిశీలించారు. దోమల మందు ఎబేట్ స్ప్రే చేయడంతో పాటు ఫాగింగ్ మిషన్లు వినియోగించాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వదలాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విస్తరణాధికారి గరిమెళ్ల రవి, కార్యదర్శులు, దారా రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి నుంచి ఇప్పటివరకు 24 డెంగ్యూ కేసులు

- ప్రస్తుతం 80 వరకు జ్వరాల కేసులు
- డీఎంహెచ్‌వో దుర్గారావుదొర



బాధితురాలిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

అంబాజీపేట, ఆగస్టు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనవరి నుంచి జూలై వరకు 24 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర తెలిపారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో డెంగ్యూ కేసు నమోదవడంతో డీఎంహెచ్‌వో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సీజనల్ జ్వరాల కేసులు 80 వరకు నమోదయ్యాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 56 మందికి జ్వరాలు ఉన్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యులు పర్యవేక్షణ చేపడుతున్నారన్నారు. అధిక వర్షాలు, వరదలు, వాతావరణ మార్పులతో జ్వరాలు వస్తున్నాయని చెప్పారు. గంగలకుర్రు అగ్రహారం పరిధిలోని జైభీమ్ నగర్‌కు చెందిన ఓ మహిళ తిరుపతి వెళ్లగా అక్కడ ఆమెకు డెంగ్యూ సోకింది. దీంతో ఆమె అక్కడ స్విమ్స్ ఆసుపత్రిలో తగిన పరీక్షలు చేయించుకుని గ్రామానికి వచ్చిందన్నారు. అప్పటి నుంచి స్థానిక వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే స్థానికంగా ఓ వ్యక్తికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసిందన్నారు. దీంతో గ్రామంలో ప్రతి ఇంటికి సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. అలాగే జైభీమ్‌నగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, వైద్యాధికారి గౌతమి, పంచాయతీ కార్యదర్శి చంటి, ఈవోఆర్డీ మమత, ఉపసర్పంచ్ బందన రాంబాబు, సీహెచ్‌వో అప్పారావు, పీహెచ్‌ఎన్ రత్నకుమారి సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలి

గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ ఏరియాలో రెండు డెంగ్యూ కేసులు నమోదు కావడంతో గ్రామమంతా ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు ఆదేశించారు. జైభీమ్‌నగర్‌లో డెంగ్యూ వచ్చిన ప్రాంతంలో ఆయన పర్యటించారు. గ్రామంలో బ్లీచింగ్, దోమల నివారణకు ఎబెట్ మందును పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి ఆర్.ఏడుకొండలు చంటిని ఆదేశించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ మమత, రామకృష్ణ తదితరులు ఉన్నారు.



సారె సమర్పించేందుకు వచ్చిన మహిళలు



శ్రీదేవికి సారె సమర్పణ

అమలాపురం టౌన్, ఆగస్టు 3: అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారికి పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు శనివారం ఆషాఢం సారెను సమర్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మహిళలు చీర, పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు, స్వీట్లతో ఊరేగింపుగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మేళతాళాల నడుమ ఊరేగింపుగా శ్రీదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు.



రేపటి నుంచి సత్యదేవుడి 134వ ఆవిర్భావ దినోత్సవాలు

అన్నవరం, ఆగస్టు 3: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి క్రోధి నామసంవత్సర ఆవిర్భావ దినోత్సవాలు ఈనెల 5 నుంచి ప్రారంభమై రెండురోజులపాటు నిర్వహించనున్నారు. సత్యదేవుడు రత్నగిరికొండపై 1891 ఖరనామ సంవత్సరం శ్రావణశుద్ధ విదియ రోజున స్వామివారి ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్నించి ఏటా శ్రావణ శుద్ధ విదియరోజున ఆవిర్భావ దినోత్సవం జరపడం ఆనవాయితీ. దీనిలోభాగంగా 5వ తేదీ ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, కలశస్థాపన, దీక్షావస్త్ర ధారణలు చేపట్టి 6వ తేదీ వేకువజామున మూలవరులకు పంచామృతాభిషేకం, ఇతర పూజాధికాలు, పండిత సత్కారాలు జరగనున్నాయి. 11 గంటలకు జరిగే ఆయుష్యహోమ పూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి. 6న అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటాన్ని సమర్పించనున్నట్టు పీఆర్వో కృష్ణారావు తెలిపారు.

7న ఉదయం నుంచి భీమేశ్వరస్వామివారి దర్శనం

ద్రాక్షారామ, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పురావస్తుశాఖ చేపట్టిన మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఈనెల 7న ఉదయం 11.05 గంటల నుంచి భీమేశ్వరస్వామివారి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్టు ఈవో పి.టి.వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. 5న ఉదయం 8.05 గంటలకు సంకల్పం, అనంతరం పాడ్యమి మొదలు తదియ వరకు త్రయాహ్నిక దీక్షగా శ్రావణ శుద్ధ 7వ తేదీ ఉదయం 9.34 గంటల వరకు కళావాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పూజాధికాల అనంతరం ఉదయం 11.05 నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగా సుందరంగా అలంకరించారు. శనివారం ఆర్జిత సేవల ద్వారా రూ.1,22,817 ఆదాయం సమకూరిందని, స్వామివారిని 1,694 మంది దర్శించుకోగా, 1,205 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా గునుపూడికి చెందిన కుందుర్తి సింహాచలం దంపతులు రూ.10,700 విరాళంగా అందించారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.9.19 లక్షలు

ద్రాక్షారామ, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.9,19,057 ఆదాయం లభించింది. అన్నదాన ట్రస్టు హుండీ ద్వారా రూ.1,22,753 ఆదాయం సమకూరింది. శనివారం దేవాదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పి.టి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది హుండీలను తెరచి కానుకలను లెక్కించారు. ఆళ్ల బుజ్జి, పెంకే సాయితేజ్, కలిదిండి వినాయకుడు, కర్రినాగేశ్వరరావు, అల్లం రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పతకాలు

మామిడికుదురు, ఆగస్టు 3: భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పలువురు విద్యార్థులు పతకాలు సాధించారని అంతర్జాతీయ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ తెలిపారు. నింజా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జూలై 26 నుంచి 28 వరకు జరిగిన బాక్సింగ్ పోటీల్లో జి.పావనిసాయిమహ (గెద్దాడ), ఎం.ప్రసీద (గూడపల్లి), సీహెచ్ అఖిల్ (మానేపల్లి), ఎస్కే నజ్రీన్ (రాజమహేంద్రవరం), వందన (అనంతపురం), ముఖేష్‌సాయియాద్ (తిరుపతి) బంగారు పతకాలు, అంతర్వేదిపాలేనికి చెందిన వై.దివ్యవాణి రజత పతకం సాధించినట్టు కోచ్ తెలిపారు. పతకాలు సాధించిన విజేతలను పలువురు అభినందించారు.




పాదగయలో పూజలు నిర్వహిస్తున్న కొణిదెల నిహారిక.. ఈవో, 'కమిటీ కుర్రాళ్లు' సినిమా యూనిట్ సభ్యులు

పాదగయలో మెగా హీరోయిన్ నిహారిక పూజలు

పిఠాపురం, ఆగస్టు3: పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని మెగా హీరోయిన్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు కుమార్తె కొణిదెల నిహారిక సందర్శించారు. నిహారిక ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మితమైన 'కమిటీ కుర్రాళ్లు' సినిమా ఆగస్టు 9న విడుదల కానున్న నేపథ్యంలో మూవీ యూనిట్‌తో కలిసి ఆమె పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించారు. ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ నిహారిక తదితరులకు స్వామి, అమ్మవారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసానికి వెళ్లారు.

వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్

- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పురందేశ్వరి, గోరంట్ల, నల్లమిల్లి

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌ని తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. రైల్వే స్టేషన్‌ని దాదాపు రూ.270 కోట్లతో అమృత్ భారత్ పథకంలో అభివృద్ధిచేయనున్న సంగతి తెలిసిందే. అయితే ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్ అవసరాల మేరకు ప్లాన్‌లో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని పురందేశ్వరి ఢిల్లీలో కలిసి వివరించారు. మార్పులపై స్పష్టమైన నివేదిక కోసం తమ అధికారులతో కలిసి రాజమండ్రి రైల్వే స్టేషను పరిశీలించాలని ఆయన సూచించారు. దాంతో వెంటనే పురందేశ్వరి శనివారం రాజమండ్రి చేరుకున్నారు. అమృత్ భారత్ స్కీం పనులను గతిశక్తి(రైల్వే బోర్డు) విభాగం చూస్తుండడంతో ఆ అధికారులు, విజయవాడ డివిజన్ అధికారులు కూడా హుటాహుటిన రాజమండ్రి చేరుకున్నారు. ముందుగా ప్లాన్‌ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా స్థానికంగా ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో రైల్వే ఉన్నతాధికారులు ఎంపీకి వివరించారు. ప్రస్తుత ప్లాన్‌లో రైల్వే పశ్చిమ వైపు ప్రధాన ద్వారం, ఐదు అంతస్తులు అధునాతన సదుపాయాలతో భవనం.. పశ్చిమ వైపు రెండు అంతస్తులతో భవనం నిర్మించాలని అనుకొంది. అయితే.. తూర్పు వైపు నగరం వేగంగా అభివృద్ధి చెందుతుండడం, 100 అడుగుల రోడ్డు రానుండడం వంటి వాటివల్ల ప్రధాన అభివృద్ధిని అటువైపునకు మార్చాలని ఎంపీ సూచించారు. తూర్పు వైపు నుంచి 1, 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలు వచ్చేలా మార్పు చేయాలని కోరారని తెలుస్తోంది. తర్వాత ఆమె రైల్వే స్టేషన్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని రైల్వే స్టేషన్‌ని అభివృద్ధి చేస్తామన్నారు. కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో మరికొన్ని రైళ్లను నిలపాలని కోరామన్నారు. వాటితోపాటు 2027 పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని కోరగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని, ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పురందేశ్వరి అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తూర్పు రైల్వేస్టేషను రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించామన్నారు. రైల్వే, మునిసిపల్ కార్పొరేషన్ సమన్వయంతో అభివృద్ధి చేస్తామన్నారు. హేవలాక్ వంతెనను పర్యాటకపరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని వివరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముడిసరుకుల దిగుమతులను దృష్టిలో ఉంచుకొని బిక్కవోలు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. కేశవరం దగ్గర ఆర్‌వోబీ ఏర్పాటు చేయాలని చెప్పగా భూసేకరణకు కృషి చేస్తామన్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల సూచనలను క్రోడీకరించి ఒక నివేదిక తయారు చేస్తామని డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొన్నారు. ఆ మేరకు రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి పనులు మొదలు పెడతామని చెప్పారు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలు నిషేధమని ఇప్పటికే అధికారులకు చెప్పామని ఆయన వెల్లడించారు. అనంతరం పురందేశ్వరి ఢిల్లీ వెళ్లారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, డీఈఈ (మెము కార్‌షెడ్) ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎస్ఎస్ఈ(వర్క్స్) వల్లి, విజయవాడ డివిజనల్ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.37.98 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వేళ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.37.98 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

లోవ క్షేత్రంలో వైభవంగా ఆషాఢ మాసోత్సవాలు

నేడు ఉదయం అమ్మవారికి నదీజలాలతో జలాభిషేకం

తునిరూరల్, ఆగస్టు 3: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన రోజులు కావడంతో విశేష పూజలతోపాటు వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఆషాఢమాసంలో అమావాస్యకు ముందు ఏటా నిర్వహించే ప్రత్యేక పూజలు లోవ క్షేత్రంలో ప్రారంభమయ్యాయి. శనివారం తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం పూజలు నిర్వహించిన పండితులు ఆదివారం ఉదయం అమ్మవారికి సప్తనదీ జలాలతో అభిషేకించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని ఆలయ పండితులు రాణి శర్మ తెలిపారు. ఈ జలాభిషేక పూజల్లో భక్తులను భాగస్వామ్యం చేసే దిశగా ఏర్పాట్లు చేశామని, ఆదివారం జరిగే ఈ పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఐఎంఏ కాన్ఫరెన్స్ ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

వైద్య రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఐఎంఏ సదస్సులో మంత్రి దుర్గేష్

రాజానగరం, ఆగస్టు 3: వైద్యరంగంలో సంతరించుకుంటున్న ఆధునిక పరిజ్ఞానాన్ని నేటి వైద్యులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఐఎంఏ)ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సును శనివారం జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో వైద్య వృత్తిలో వస్తున్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుంటే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించగలరన్నారు. సభాధ్యక్షుడు, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంజేసీ నాయుడు మాట్లాడుతూ ఏపీ శాసనమండలిలో వైద్యులకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి విన్నవించారు. అలాగే డాక్టర్లపై ఒత్తిడి పెంచేలా రూపుదిద్దుకున్న 2008 సంవత్సరంలో రూపుదిద్దుకున్న 11వ చట్టంలో సవరణలు, క్లినిక్స్ నర్సింగ్ హోమ్ రిజిస్ట్రేషన్లకు సింగిల్ విండో ఏర్పాటు అవసరమని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ వైద్యరంగం తరపున కనీసం ఒక వైద్యునికైనా ఎమ్మెల్సీ అవకాశం కల్పించేలా ప్రభుత్వాన్ని కోరనున్నామని బదులిచ్చారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ సహా తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 500మందికి పైగా జనరల్ సర్జన్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్, రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ డాక్టర్ వై.గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ పి.విజయభాస్కర్ తదితరులు మాట్లాడారు. ఐఎంఏ డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పీఎస్ శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ తదితరులు నిర్వాహకులుగా ఉన్నారు.



వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అత్యవసర సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోం

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు.. మాలమహానాడు రద్దుచేసి వీవీపీఎస్‌లోకి రండి

రాజమహేంద్రవరంలో అత్యవసర సమావేశం : స్టేట్ కన్వీనర్ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు3: వర్గీకరణ చేస్తే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పతనం తప్పదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈట్‌అండ్‌ప్లే కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన అత్యవసర మాలల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్షకుమార్ నేతత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటైంది. దేశంలో మాలమాదిగలను విడదీసేందుకు ఓటు బ్యాంక్ రాజకీయాలకు పెద్దకుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఒక్కసారిగా జాతికి జరుగుతున్న అన్యాయంపై చాలా బాధ కలిగిందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్న వారిలో సమాజంలో అగ్రవర్ణాలతో సమాన స్థాయికి ఎదిగిన వారిని తొలగించడం కాని లేదా దారుణస్థితిలో ఉండి రిజర్వేషన్లు పొందని వారిని తిరిగి చేర్చడంకాని చేసే అధికారం రాష్ట్రపతి, పార్లమెంట్‌కు ఉంటుందన్నారు. అయితే విభజించాలంటే పార్లమెంట్‌లో అమెండ్‌మెంట్ చేసి మెజార్టీ తీర్మానం చేయాలని దాని ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఉంటుందన్నారు. కానీ ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఏకపక్షంగా తీర్పునివ్వడం దారుణమన్నారు. ఇందులో న్యాయమూర్తి త్రివేది ఈ తీర్పును వ్యతిరేకించారని చెప్పారు. మాలమాదిగలను విడదీసి భవిష్యత్‌లో రిజర్వేషన్లు ఎత్తివేయాలనే కుట్ర దాగి ఉందన్నారు. అందుకే వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. మాలమహానాడు, సంఘాలను రద్దు చేసుకుని అందరూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. మల్లెల వెంకట్రావు ఢిల్లీలో సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలు చేసే పనిలో ఉన్నారని, తాను కూడా న్యాయపోరాటం చేస్తానన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాలలు కదలకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. విధివిధానాలు లేకపోయినా అప్పుడే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తామని ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లోగాని వర్గీకరణ జరిగితే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. లీగల్ కమిటీ, యువజన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయా నాయకులకు హర్షకుమార్ సూచించారు. తెలంగాణ మాల సంఘాల నేతలు టి.రవి (మిర్యాలగూడ), బాలస్వామి (నాగర్‌కర్నూల్), అనిల్‌కుమార్ (పాలమూరు), డాక్టర్ మునిబాబు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబటి కొండలరావు, బి.చంద్రయ్య (ప్రకాశం), వెంకటేశ్వరరావు (అనకాపల్లి), మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బెన్నయ్య, అరుణకుమారి (గుంటూరు), జ్యోతి మేరి, ఈశ్వరి (ఎన్‌టీఆర్ జిల్లా), జంగా బాబూరావు, జీవీ శ్రీరాజ్, రఘుబాబు మాట్లాడారు. మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్‌గా భరత్‌భూషణ్‌ను ప్రకటించారు. అనంతరం ఐదు తీర్మానాలు చేశారు. ఐకమత్యంలో ఉద్యమించాలని, ఉభయతెలుగు రాష్ట్రాల్లో అన్ని మాల సంఘాలను రద్దు చేసి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని, వర్గీకరణ ఉద్యమానికి మాల ఉద్యోగులు పూర్తి సపోర్టుగా ఉండాలని, లీగల్ కమిటీ గైడెన్స్‌లో న్యాయపోరాటం చేయాలని, ప్రతి జిల్లాలో ఇద్దరు.. ముగ్గురిని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి స్టేట్ కమిటీలో సభ్యులుగా ఉంచాలని, స్టేట్ కన్వీనర్‌గా హర్షకుమార్‌నే నిర్ణయిస్తూ సమావేశం తీర్మానాలు చేసింది.



వరద నీటి నుంచి బయటపడిన డ్రెడ్జింగ్ నావ

పెదబ్రహ్మదేవంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం

యువకుడికి దేహశుద్ధి.. ఇరువర్గాలపైనా కేసులు



అజయ్

సామర్లకోట, ఆగస్టు 3: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో ఒక సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడన్న ఫిర్యాదుపై గ్రామానికి చెందిన చాపల అజయ్ యువకుడిని ప్రోత్సహించారన్న నేరంపై నలుగురు వ్యక్తులపైనా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇదే సంఘటనలో దళిత యువకుడిపై ఏడుగురు వ్యక్తులు దౌర్జన్యంచేసి గాయపర్చారన్న రెండోవర్గం చేసిన ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. గ్రామంలో ఈ ఘటనతో శాంతిభద్రతలు అదుపుతప్పకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా గ్రామంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. రాత్రికి నిరంతరం పోలీసు పికెట్ ఉంచేలా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామానికి చెందిన మైనర్ బాలిక కాకినాడ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా అదేగ్రామానికి చెందిన దళిత యువకుడు తాను ప్రేమిస్తున్నానని వెంటబడుతుండడమేగాక ఈ నెల 1న సదరు బాలికను కిడ్నాప్‌చేసి 2న గ్రామంలో బస్టాండ్ వద్ద విడిచిపెట్టినట్టు సమాచారం. కాగా శనివారం అజయ్ మోటార్ సైకిల్‌పై బాలిక ఇంటికి చేరుకుని అత్యాచారయత్నానికి పాల్పడడంతో బాలిక కేకలకు కుటుంబసభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని యువకుడికి దేహశుద్ధి చేశారు. బాలిక, తాను గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నామని యువకుడు పోలీసులకు చెప్పగా తాను ఈనెల 1న బాలికను కాకినాడ తీసుకెళ్లినట్లు అంగీకరించినట్లు సమాచారం. అయితే యువకుడి చేతులుకట్టి కొట్టికిందపడవేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో ఉదయం నుంచీ వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సామర్లకోట సీఐ అంకబాబు తదితర పోలీసులతో కలిసి సంఘటనా స్థలి అయిన పెదబ్రహ్మదేవం చేరుకున్నారు. అప్పటికే గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల నుంచి వాస్తవసమాచారాన్ని సేకరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు అజయ్ వాంగ్మూలం కూడా పోలీసులు సేకరించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రెండు వైపులా కేసులు నమోదు చేసినట్లు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి చెప్పారు. గాయపడిన అజయ్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రాణాపాయం ఏమీలేదని గ్రామంలో పోలీసుపికెట్ కొనసాగుతుందన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజమహేంద్రవరంరూరల్, ఆగస్టు3: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు సచివాలయం-3లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విప్పర్తి నిఖిల్ కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ ఉదయం 5 గంటల నుంచే పంపిణీ చేపట్టాలంటూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అయితే నిఖిల్‌కృష్ణ 10 గంటల వరకు లాగిన్ ఓపెన్ చేయకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేశారు. ఈ సంఘటన ఈనెల 1న జరిగింది. సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ తండ్రి జిల్లా పరిషత్ ఛైర్మన్ కావడంతో సంబంధిత అధికారులు విషయాన్ని బయటకు రానీయకుండా గోప్యంగా ఉంచినట్టు తెలిసింది. ప్రతీ సమాచారాన్ని తెలిపే డీపీఆర్‌వో ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచడం విమర్శలకు దారితీసింది.

గోదావరిలో దూకిన వ్యక్తి కోసం గాలింపు

పి.గన్నవరం, ఆగస్టు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి శనివారం గుర్తు తెలియని వ్యక్తి దూకడంతో వరదనీటిలో గల్లంతయ్యాడు. కొత్త అక్విడెక్టుపై చెప్పులు వదిలి గోదావరిలో దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అతడు దూకే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ వచ్చే ప్రయత్నం చేయగా, అప్పటికే నీటిలో దూకేసినట్టు చెప్పారు. కొత్త అక్విడెక్టుపై నుంచి దూకిన వ్యక్తి పాత అక్విడెక్టు దాటేవరకు కనిపించాడని గోదావరిలో గేలం వేస్తున్న వ్యక్తులు చెప్పారు. తహశీల్దార్ ఎస్కే హుస్సేన్, అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి, ఏఎస్ఐ ఎన్.పట్టాభిరామయ్య, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహరావులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఉడిమూడిలో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సంఘటనా స్థలానికి రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆ వ్యక్తి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు.

వరద నీటి నుంచి బయటపడిన డ్రెడ్జింగ్ నావ

ధవళేశ్వరం, ఆగస్టు 3: కాటన్ బ్యారేజ్ గేటుకు అడ్డంగా మునిగిన డ్రెడ్జింగ్ నావ గోదావరి నీటిమట్టం తగ్గి నీటి నుంచి బయటకు కనిపిస్తుండడంతో శనివారం బయటకు తీయడానికి నావ యజమానులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నావకు ఐరన్ రోప్‌లు కట్టి కప్పీల సహాయంతో ఆ ప్రాంతం నుంచి ఒడ్డుకు లాగడానికి చేసిన ప్రయత్నాల్లో బలమైన ఇనుప రోప్ సైతం తెగిపోయింది. నావ దిగువ భాగం బురదలో దిగబడిపోవడంతో బయటకు లాగడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వరద ఉధృతికి గాయిత్రి ఇసుక ర్యాంప్ వద్ద లంగరు వేసిన డ్రెడ్జింగ్ నావ గత నెల 25న కాటన్ బ్యారేజ్ వద్దకు కొట్టుకు వచ్చి 1వ నెంబరు గేటుకు అడ్డంగా మునిగిపోయింది. ప్రస్తుతం నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారిన నావను బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం మరింత పకడ్బందీ ఏర్పాటుతో నావను బయటకు లాగడానికి జరుగుతున్న ఏర్పాట్లు బ్యారేజ్ ఏఈఈ నాగలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులు

రాజమహేంద్రవరం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద బాగా తగ్గుతోంది. జూలై 19వ తేదీ నుంచి పెరగడం మొదలెట్టిన వరద గోదావరి పెరుగుతూ, తగ్గుతూ, మళ్లీ పెరుగుతూ వచ్చిన సంగతి తెలిసిందే. కానీ రెండు రోజుల నుంచి బాగా తగ్గుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు నీటిమట్టం 8.50 అడుగులుగా ఉంది. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 5,81,417 క్యూసెక్కులు వరద ప్రవాహం వెళుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి పాండ్ లెవల్ 13.26 మీటర్లుగా ఉంది. గోదావరి డెల్టా కాలువలకు 8,800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 33.90 అడుగులకు చేరింది. కాగా ఎగువ భాగంలో వర్షాలులేవని అధికారులు చెబుతున్నారు. కాళేశ్వరం వద్ద స్వల్పంగా పెరుగుతుండగా ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద 33.10 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం నిదానంగా పెరుగుతూ శనివారం రాత్రి 7 గంటలకు 34.10 అడుగులకు చేరింది. భద్రాచలంలో ఇక పెరుగుదల లేకపోతే మొత్తం వరద లాగేస్తుంది. పొలాలు, డ్రైన్లలోని నీరు కూడా దిగిపోతుంది. వరి రైతులు తిరిగి మళ్లీ వెదజల్లే పద్ధతిలో సాగుకు వెళతారా, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటారా అనేది తేలనుంది.

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- కొత్తపేట ఏఎంసీలో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆలమూరు ఏపీవో అరుణ బాధ్యతలు స్వీకరణ



ఆలమూరు, ఆగస్టు 3: ఆలమూరు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో జి.అరుణకుమారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది కాలంగా ఇక్కడ ఏపీవోగా వీవీవీ ప్రసాద్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అరుణకుమారి రామచంద్రపురం నుంచి ఆలమూరుకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆమె ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. గతంలో అరుణకుమారి ఆలమూరు ఏపీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు.

యానిమేటర్ రూ.2.20లక్షలు స్వాహాపై నిరసన



నిరసన తెలుపుతున్న డ్వాక్రా మహిళలు

మామిడికుదురు, ఆగస్టు 3: ఆదుర్రు గ్రామానికి చెందిన భారతి స్వయంసహాయకసంఘానికి సంబంధించిన రూ.2.20 లక్షలు సంఘ అధ్యక్షురాలు, యానిమేటర్ జక్కంపూడి సత్య విజయదుర్గ స్వాహా చేసిందని ఆరోపిస్తూ శనివారం మామిడికుదురు మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సంఘ సభ్యులను ఏపీఎం అజయ్ సమాఖ్య కార్యాలయానికి పిలిచి మీరు కట్టిన సొమ్ములో ఏ అవకతవకలు లేవని, మీ సంఘం తీర్మానం పుస్తకంలో సంతకాలు చేసి ఇవ్వాల్సిందిగా బెదిరించినట్టు పేర్కొన్నారు. దీనికి మేము నిరాకరించడంతో ఏపీఎం 2018నుంచి 2023వరకు స్టేట్‌మెంట్ ఇచ్చారని దాని ప్రకారం లెక్కించగా రూ.2.20లక్షలు తేడా వచ్చినట్టు ఆరోపించారు. దీనిపై సమాఖ్య ఏపీఎం పిలిచి పరిశీలించి సంబంధిత సొమ్మును సంఘ అధ్యక్షురాలిని కట్టమని చెప్పగా ఆమె నిరాకరించిందని పేర్కొన్నారు. దీనిపై విచారణచేసి తమ సొమ్మును తమకు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండు చేస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ పెదమల్లు రామలక్ష్మి, సభ్యులు జక్కంపూడి తేజస్విని, మణిమాల, బిందుమాధవి, గంగాభవానీ, పద్మావతి, తేజస్విని, స్థానిక సర్పంచ్ బి.శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

పంట పొలాల ముంపుపై చర్యలు తీసుకోండి



పంట పొలాలు పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు3: ముచ్చుమిల్లి వద్ద ముంపునకు గురైన పంట పొలాలను శనివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిశీలించారు. ముచ్చుమిల్లి కాలువ నీరు ఎక్కువగా ఉండటంతో పొలాలు నీట మునుగుతున్నాయని రైతులు మంత్రికి తెలిపారు. సమస్యను పరిష్కరించాలని నీటిపారుదల శాఖఅధికారులను మంత్రి ఆదేశించారు. మధ్యనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పేమ్మిరాజకుమార్‌కు మంత్రి సుభాష్ రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో పులువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి రూ.2 లక్షలు ఆర్థిక సాయానికి హామీ

పట్టణంలో మధ్యనగర్‌కు చెందిన చిట్టూరి రామకృష్ణను మంత్రి సుభాష్ శనివారం పరామర్శించారు. రామకృష్ణ ఏపీ ఈపీడీసీఎల్ చెట్టు కొమ్మలు నరికే పనిలో ప్రమాదావశాత్తు చెట్టుపై నుంచి పడగా వెన్నుకు తీవ్రగాయమైంది. దీంతో రామకృష్ణ మంచానికే పరిమితమయ్యాడు. దీంతో మంత్రి సుభాష్ రామకృష్ణను పరామర్శించి రూ.2లక్షలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి కూడా ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని, పిల్లల చదువుకు కూడా భరోసా ఇచ్చారు. శనివారం రాత్రి 7,8,9,10 వార్డుల్లో మంత్రి సుభాష్ పట్టణంలో కృతజ్ఞతా పర్యటన చేశారు. వార్డులో సమస్యలు అడిగితెలుసుకున్నారు. నిలిచిపోయిన గ్రంథాలయం నిర్మాణం పూర్తి చేయిస్తానని, డ్రైన్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడిశెట్టి శేషారావు, కొసనా శ్రీనివాసరావు, నారపరెడ్డి బలరాం, చందమామ వాసు, దంపన బోయిన పద్మావతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకా... ముంపులోనే కనకాయలంక కాజ్‌వే



కనకాయలంక కాజ్‌వే వద్ద సాగుతున్న పడవ ప్రయాణం

పి.గన్నవరం, ఆగస్టు 3: వరద ముంచెత్తి లంక గ్రామాల్లో ప్రజాజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఎగువ ప్రాంతంలో వరద ఉధృతి తగ్గినప్పటికీ దిగువున నదీపాయలు ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక, పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనాగర్లంక, పెదమల్లంక, ఆయోధ్యలంక గ్రామస్తులు ఇంకా నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేపై ఇంకా వరద ఉధృతి కొనసాగడంతో ఆప్రాంత వాసులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కాజ్‌వేపై కొంత మేర తగ్గిన వరద ఉధృతిలో కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. లంకల్లో పూర్తిగా నష్టపోయిన ఉద్యాన పంటలను ఉద్యానశాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టాలను నమోదు చేస్తున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రావులపాలెం, ఆగస్టు 3: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎల్పీవో ఎ.రాజు అన్నారు. రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాలులో నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.డీఎల్పీవో రాజు మాట్లాడుతూ గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్పెంటర్ సంఘ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్, ఆగస్టు 3: దుర్గామల్లేశ్వరస్వామి చేతివృత్తుల కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న కార్యాలయం వద్ద కొనుకు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా సంఘ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై కార్మిక సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దంగేటి రామకృష్ణ, పితాని బేబిరావు, కుసుమే నరసింహారావు, కందాల సూర్యనారాయణ, కేతా సోమేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరావు, చింతా వెంకటేశ్వరరావు, తరెట్ల వెంకటేష్, కొవ్వూరి శ్రీను పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

కె.గంగవరం, ఆగస్టు 3: వరదలతో ఇబ్బంది పడుతున్న పాడి రైతులకు ప్రభుత్వం అండగాఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, పశుసంవర్ధక శాఖ కోనసీమ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కర్నెడమూర్తి,రామచంద్రపురం ఏడిఏ ఓ.రామకృష్ణ అన్నారు. శనివారం మసకపల్లి, భట్లపాలిక, కోట, సుందరపల్లి గ్రామాల్లో 352మంది పాడి రైతు లకు సంబంధించి 1020 పాడి పశువులకు 26మెట్రిక్ టన్నుల సమీకృత దాణా పంపిణీ చేశారు. పశు వైద్యులు ఎం.కృష్ణార్జున, సంయుక్త లక్ష్మి, సురేష్‌బాబు, రామచంద్రరావు, బిందు, భవ్యశ్రీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు పరామర్శ

ఆత్రేయపురం, ఆగస్టు 3: ర్యాలి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందగా వారి కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. టీడీపీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు హనుమంతు సత్యనారాయణ, బండారు వెంకటసుబ్బయ్య, పొడమర్తి అన్నపూర్ణ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమల స్థాపనకు కృషి



కొబ్బరి కొనుగోలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, ఆగస్టు 3: కోనసీమ జిల్లాలో ముఖ్యమైన పంటలుగా ఉన్న కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. స్థానిక ఏఎంసీలో శనివారం నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1996 కోనసీమ తుఫాన్ కారణంగా కొబ్బరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారికి గిట్టుబాటు ధర కల్పించేందుకు నాటి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కృషి ఫలితంగా కోనసీమలో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. రైతులు కొబ్బరి మీద ఆధారపడకుండా అంతరపంటలు వేసుకోవాలని తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. ఈప్రాంతంలో కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పేందుకు సంబంధిత శాఖా మంత్రిని కలిసి ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ఉన్న వనరుల గురించి వివరించినట్లు చెప్పారు. నాఫెడ్ కొనుగోలు కేంద్రం ద్వారా గిట్టుబాటు ధర లభిస్తుందని ఈప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీపీ మార్గాన గంగాధర్, జడ్పీటీసీ గుడపాటి రమాదేవి, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మిభాస్కరరావు, దర్నాల రామకృష్ణ, పాలూరి సత్యానందం, త్సామా బాబు, రెడ్డి రామకృష్ణ, యల్లమల్లి జగన్మోహన్, చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి సత్యనారాయణ, గుబ్బల మూర్తి, బండారు వీరబాబు, అద్దంకి చంటిబాబు, మిద్దే ఆదినారాయణ, బీర ఇసాక్, ఆయిల్ మేనేజర్ సుధాకరరావు, కృషీవల చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అద్దాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

అంబాజీపేట, ఆగస్టు 3: న్యాయవ్యవస ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, స్పెషల్ మేజిస్ట్రేట్ పీవీ ప్రసాదరావు అన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సౌజన్యంతో జిల్లా కోర్టుఆదేశాలతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్, న్యాయవాదులు భాస్కరశాస్త్రి, షరీఫ్, వైద్యాధికారి కేఎస్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు పెంపుపై ఉద్యోగుల హర్షం

యానాం, ఆగస్టు3: పుదుచ్చేరి ఆరోగ్య శాఖలో పనిచేస్తోన్న ఆశావర్కర్ల వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద సిబ్బంది విలేకరులతో మాట్లాడారు. యానాంలో ఆశావర్కర్లను నియమించింది మల్లాడి కృష్ణారావువేనని అన్నారు. జీతాలు పెంపు తదితర అంశాలపై మల్లాడి చేసినకృషిని వారు అభినందించారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సీఎం ఎన్.రంగాసామి, గవర్నర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఆరోగ్యశాఖ కార్యాదర్శి, డైరెక్టర్లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అసభ్యకర ప్రవర్తనపై కేసు నమోదు

అంబాజీపేట, ఆగస్టు 3: మహిళా సచివాలయ ఉద్యోగిపై మరో ఉద్యోగి అసభ్యకరంగా ప్రవర్తించడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. వాకలగరువు సచివాలయంలో ఉప్పలగుప్తం మండలం మునిపల్లికి చెందిన దోనపాటి రాంజీ వేల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల1న సచివాయల ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. మాచవరం భారతీ కాన్వెంట్ సమీపంలోని ఓ వ్యక్తికి పింఛన్ అందించాల్సి ఉందని వెల్ఫేర్ అసిస్టెంట్ రాంజీ వాకలగరువు సచివాయంలో పశుసంవర్థక శాఖ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని కోరాడు. తన ఫోన్‌లో చార్జింగ్ అయిపోయిందని ఆ ఉద్యోగిని సెల్‌ఫోన్‌లో లాగిన్ అయి పింఛన్ ఇద్దామని తెలపగా ఆమె మాచవరం వెళ్లింది. అయితే ఒక ఇంట్లోకి వెళ్లిన తరువాత వెల్ఫేర్‌అసిస్టెంట్ రాంజీ తలుపు వేయడంతో భయం వేసి ఆమె బయటకు వచ్చేసింది. అనంతరం ఆ యువతికి మెస్సేజ్ పెట్టి వేధిస్తుండటంతో ఆ మహిళా ఉద్యోగిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

అమలాపురం టౌన్, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని భారత రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్‌తో పాటు పలువురు నాయకులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని భారత ప్రభుత్వాన్ని కోరుతూ శనివారం కలెక్టరేట్‌లో జేసీ టి.నిషాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బడుగు సత్యనారాయణ, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే దేవ





అంతర్వేది: వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ, ఉప్పలగుప్తం: బాధితులకు నిత్యావసర సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అంతర్వేది, ఆగస్టు 3: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి లాకోపేట అగ్నికుల క్షత్రియుల కాలనీలో శనివారం రెవెన్యూ అధికారులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటించారు. కాలనీ వాసులతో మాట్లాడారు. వరద ప్రభావం తగ్గడంతో ప్రతీ ఇంటికీ వెళ్లి వారి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. కూలిపోతున్న ఇళ్లు, ఇళ్ల చుట్టూ చేరిన బురద, తదితర వరద ముంపు సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలు చూడాలన్నారు. శానిటేషన్ ప్రక్రియ త్వరతిగతిన పూర్తిచేయాలని, దోమల బెడద లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, మండలాధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, తాడి మోహన్, ఉండపల్లి అంజి, మేడిచర్ల శేఖర్, నాయుడు కృష్ణ, గుబ్బల రవికిరణ్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు పి.నాగపద్మలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీం, ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, కొర్లపాటి గోపి, గుడాల ఫణి, పితాని కేశవ, మిద్దెల శ్రీను, రవణం రాము, కొప్పినీడి ఈశ్వరరావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆనందరావు పరామర్శ

ఉప్పలగుప్తం, ఆగస్టు 3: చినగాడవిల్లి రామాలయంపేట, మునిపల్లికోటిగట్టు అగ్ని ప్రమాద బాధితులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం పరామర్శించారు. చినగాడవిల్లిలో కార్యకర్తలు సమకూర్చిన నిత్యావసరాలను బాధితులకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఆకేటి పెద్ద, నిమ్మకాయల సూర్యప్రకాష్, గుత్తుల చిన్నా, చెరుకూరి శ్రీనివాస్, గుత్తుల మాధవ, యర్రా కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం పంపిణీ

అంబాజీపేట, ఆగస్టు 3: గోదావరి వరద ముంపు బాధితులకు ప్రభుత్వ సాయాన్ని నాయకులు, అధికారులకు శనివారం అందించారు. వాకలగరువు, నందంపూడి, తొండవరం, మాచవరం గ్రామాలకు సంబంధించి 96మందికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో

విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కిట్లు పంపిణీ

అల్లవరం, ఆగస్టు3: కష్టాల్లో ఉన్న పేదలనుఆదుకోవడంలో తాళ్ల సరస్వతమ్మ- ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ముందుంటుందని ట్రస్ట్ కార్యదర్శి విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి టీఎస్ఎన్ మూర్తి చెప్పారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బోడసకుర్రు పల్లిపాలెంలో 300మంది కుటుంబాలకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, అడపా శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, చింతా బాబ్జి, ఓలేటి పరమేశ్వరరావు, ఐలా నాగేశ్వరరావు, కుడుపూడి రామకృష్ణ, బొంతు శ్రీను, మొయిల గణపతి, రొక్కాల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

పి.గన్నవరం, ఆగస్టు3: వరద బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. వైకొత్తపల్లి, కె.ముం జవరం, ముంగండపాలెం గ్రామాల్లో వరద బాధితులకు రేషన్‌బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు, జనసేన జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, సంసాని పెద్దిరాజు, మట్టపర్తి రామకృష్ణ, తోలేటి సత్తిబాబు, షేక్ దొరబాబు, యడ్ల ఏసుభాస్కరరావు, గుత్తుల రామకృష్ణ, తాటికాయల శ్రీనివాసరావు, దైవాల రాంబాబు, గిడ్డి వెంకటేష్, పోలిశెట్టి సత్యనారాయణ, మట్టపర్తి శ్రీను, యర్రంశెట్టి తాత కాపు, అడ్డగళ్ల సిరిసతీష్, మోకా ప్రసాద్, పాలూరి ఫణి, దొమ్మేటి సత్తిబాబు, యర్రంశెట్టి రమణ, టి.కనకరాజు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ముమ్మిడివరం, ఆగస్టు 3: ఆరోగ్య సమస్యలకు మండల స్థాయిలో ఏర్పాటుచేసిన హెల్త్ సెంటర్ ద్వారా వైద్య సేవలు పొందవచ్చునని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ఠాణేలంక గ్రామ సచివాలయం వద్ద శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 104 వాహన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎ.మణి, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, న్యాయవాదులు కాశి సిద్ధార్థకుమార్, జిల్లా మెడికల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమలత, స్వామినాయుడు, 104 సిబ్బంది కె.విజయ్, పి.మేఘన, బిందుమాధవి, సతీష్, ఎస్ఐ బి.సురేష్‌బాబు, ఆశ వర్కర్లు, సిబ్బంది, స్థానిక నాయకులు ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బొక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

రావులపాలెం, ఆగస్టు 3:మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రావులపాలెంలోని శ్రీఅలివేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. జాతీయ రహదారి చెంతనే ఉన్న చిన్నఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష రుద్రాక్ష పూజ బ్రోచర్ ఆవిష్కరణ

ఐ.పోలవరం, ఆగస్టు 3: మురమళ్ల భద్రకాళీవీరేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు ఒకటో తేదీన నిర్వహించనున్న లక్ష రుద్రాక్షపూజ బ్రోచర్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శనివారం ఆవిష్కరించారు. పవిత్ర పుణ్యక్షేత్రం వారణాసి నుంచి తెచ్చిన లక్ష రుద్రాక్షలతో వీరేశ్వరునికి పూజ చేయనున్నారు. ఆలయ అర్చకులు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ, గుత్తుల సాయి, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, నాగాభట్ల రవిశర్మ, శ్రీరామ్‌శర్మ, పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్

రాయవరం, ఆగస్టు 3: లొల్లలో సువర్చలా సమేత అభయాంజనేయస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. చెరుకువాడకు చెందిన వైఖానస పండితులు ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు, కేశవ రామాచార్యులు, శ్యామసుందరం అర్చకత్వంలో గారపాటి తమ్మయ్య, శేషారత్నం దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని మంత్రి వాసంశెట్టి శుభాష్ దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. అలాగే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి, పారిశామికవేత్త కంటిపూడి సర్వారాయుడు స్వామివార్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాత్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ నైట్ల సతీష్, గందం పల్లంరాజు, చేవా సత్యనారాయణ, జనసేననేత గరగ సోమన్న, విశ్రాంత ఉపాధ్యాయులు, వీర్రాజు, అప్పారావు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారాల్లో భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి

అంతర్వేది, ఆగస్టు 3: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నాలుగు శుక్రవారాల్లో (9, 16, 23, 30తేదీల్లో) శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 12ఏళ్లుగా దాతల సహకారంతో వరలక్ష్మీకుంకుమ పూజలు జరుగుతున్నాయని ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యులు రామలింగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ కుంకుమ పూజల్లో పాల్గొనే భక్తులకు అమ్మవారి రూపు, పూజా సామగ్రి అందిస్తామన్నారు. కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత సర్వసాధారణ దర్శనం కల్పిస్తామన్నారు. సముద్రం వద్ద రూ.7.50లక్షలతో దుస్తులు మార్చుకునే వసతిగదులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు గిరిజనులకు శిక్షణ

అమలాపురం టౌన్, ఆగస్టు 3: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజన యువతీ యువకులు ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందేందుకు రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాలతో పాటు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజనులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఈడీ, డీఈడీ, టెట్ ఉత్తీర్ణులైనవారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణలో భాగంగా మహిళలకు 33శాతం పైబడి రిజర్వేషన్ సదుపాయం కల్పించారన్నారు. ఈనెల8వ తేదీలోగా దరఖాస్తులు అందించాలన్నారు. ఫైనల్ మెరిట్ లిస్టును ఈనెల14న ఐటీడీఏ కార్యాలయపు నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. ఆగస్టు మూడో వారం నుంచి 90రోజుల పాటు 150మంది గిరిజన అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గిరిజన సంక్షేమశాఖ సీనియర్ అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. వివరాల కోసం యూత్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ సెల్ 7569098197ను సంప్రదించాలన్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి వినతి

అమలాపురం టౌన్, ఆగస్టు 3: విద్యా రంగంతో పాటు మున్సిపల్ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ సంఘ నాయకులు శనివారం అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు, బదిలీలు వెంటనే జరిపించాలని మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని, అద్దె భవనంలో నడుస్తున్న మున్సిపల్ పాఠశాలలకు భవన సదుపాయాలు కల్పించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.చంద్రకళ, పట్టణ ప్రధాన కార్యదర్శి కె.పరమేశ్వరరావు, సీనియర్ నాయకులు బీఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్ హరిబాబు, ఎస్వీ రమణ, జీవీవీ రాజేశ్వరి, కె.వెంకటేశ్వర్లు, పి.రాజేష్, ఎం.శ్రీనివాస్, కె.సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజప్ప పరామర్శ

ముమ్మిడివరం, ఆగస్టు 3: టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ జిల్లా కార్యదర్శి పొత్తూరి విజయభాస్కరవర్మ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. చినకొత్తలంకకు విజయభాస్కవర్మ గురువారం మృతిచెందిన విషయం విదితమే. శనివారం వర్మ కుటుంబ సభ్యులను రాజప్ప పరామర్శించారు. వర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల బాబు, వీపూరి వెంకటసత్యనారాయణరాజు, పెద్దిరెడ్డి గోపాలకృష్ణ, గొల్లపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు3:మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు నివారణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలు ఒమ్ముచేయకుండా పిల్లలు బాధ్యతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, సభ్యుడు దొమ్మలపాటి సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణ అర్బన్ సెంటర్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో జడ్జిలు కె.వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు నాయక్‌లు రోగులకు మందులు పంపిణీ చేశారు.

విరాళాలు సేకరణ

అమలాపురం టౌన్, ఆగస్టు 3: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన ఘటనలో 174మంది మృతిచెందడం బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. వయనాడ్ బాధితుల సహాయార్థం సీపీఎం జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం సహాయ నిధి సేకరణ చేపట్టారు. పట్టణంలో, పలు వీధుల్లో వ్యాపారుల నుంచి విరాళాలను సేకరించారు. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, నాయకులు నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, పీతల రామచంద్రరావు, బి.శ్రీను, పొలమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: శివం భజే
శ్రీలలిత	: తిరగబడరా సామి
శేఖర్ స్క్రీన్-1	: బడ్డీ
శేఖర్ స్క్రీన్-2	: అలనాటి రామచంద్రుడు
రమా	: రాయన్
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డెడ్ పూల్

50ఏళ్ల అనంతరం అపూర్వ కలయిక



అమలాపురం టౌన్, ఆగస్టు 3: అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 50ఏళ్ల అనంతరం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలుసుకున్నారు. అమలాపురం పరిసర ప్రాంతాలకు చెందిన అలనాటి విద్యార్థులంతా వివిధ రకాల ఉద్యోగాల్లో పనిచేసి పదవీ విరమణ చేయగా వ్యాపార రంగాల్లోను స్థిరపడి వివిధ ప్రాంతాల్లో ఉంటున్న మిత్రులంతా శనివారం స్నేహితుల దినోత్సవానికి ఒకరోజు ముందుగా హైదరాబాద్‌లోని లియో నియో పోలిస్టిక్ డెస్టినేషన్ సెంటర్‌లో కలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని స్నేహితులు వారి కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, యర్రమిల్లి మూర్తి, బి.శాస్త్రి, మంథా శ్రీను, ఎం.జిగురాజు, రామం, పి.సుబ్బారావు, సలోమి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేయాలి

అయినవిల్లి, ఆగస్టు 3: ముక్తేశ్వరం హైస్కూలు నుంచి అయినవిల్లి సొసైటీ వరకు నిర్మించిన రహదారిపై భారీ వాహనాల అనుమతిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు గ్రామస్తులతో శనివారం అయినవిల్లిలో సర్పంచ్ కాకర శ్రీను అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు మాట్లాడుతూ 1.59 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ నిబంధనల మేరకు రెండు యూనిట్ల పైబడి వాహనాలు వెళ్లకుండా రహదారిని నిర్మించారన్నారు. కానీ 400 కేవీ ఎలక్ట్రికల్ నిర్మాణం చేపట్టే సంస్థ ఆరు యూనిట్ల లారీలను రాత్రింబవళ్లు తిప్పడం వల్ల రహదారి మరమ్మతులు చేయాల్సి వస్తుందన్నారు. ఐరన్ గ్రిడ్స్‌పై చర్చించారు. అయినవిల్లి వినాయకస్వామి దేవస్థానం వద్ద మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్ అధికంగా ఉండడంతో ఈరహదారి భారీ వాహనాలకు అనుమతి తప్పనిసరని గ్రిడ్‌లు వేయద్దని తెలిపారు. సదరు రోడ్డు ఆర్అండ్‌బీకి అప్పగించడానికి చర్యలు ఎమ్మెల్యే ద్వారా చేపట్టాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వేటుకూరి వెంకట్రాజు, ఆలయ ఈవో ముందునూరి సత్యనారాయణరాజు, కాకిలేటి శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, ఏఈ గంగాధర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

మామిడికుదురు, ఆగస్టు 3: అప్పనపల్లికి చెందిన వరద బాధితులకు గోడికి చెందిన తాళ్ల సరస్వతమ్మముత్యాలు చారిటబుల్ ట్రస్టు శనివారం నిత్యావసరాలను అందించింది. ఐఆర్ఎస్ మాజీ అధికారి తాళ్ల సత్యనారాయణమూర్తి 200మందికి నిత్యావసర కిట్లు అందించారు. కార్యక్రమంలో గనిశెట్టి చినబాబు, పాటి గోవిందు, నల్లమిల్లి ప్రకాశరావు, తులా గోపాలకృష్ణ, కంకిపాటి నరసింహారావు, తులా శ్రీనివాస్, తులా ఆది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

యానాం,ఆగస్టు3: యానాంశివారు సావిత్రినగర్ న్యూకాలనీకి చెందిన దండుప్రోలు కామేశ్వరి(22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దండుప్రోలు సత్తిబాబు(సతీష్), కామేశ్వరి దంపతులు న్యూకాలనీలో నివాసం ఉంటున్నారు. భర్త సోమవారం వేటకు వెళ్లి శనివారం వచ్చాడు. అనంతరం వీరి మధ్య విభేదాలు వచ్చాయి. మనస్తాపానికి గురైన కామేశ్వరి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణలు సేకరిస్తున్నారు.

పదోన్నతులు కల్పించాలని డిజిటల్ అసిస్టెంట్స్ వినతి

మలికిపురం, ఆగస్టు 3: పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్స్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండుమార్కులో ఎమ్మెల్యే దేవను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం సచివాలయాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమోషన్ చానల్, పేస్కేలు గురించి వివరించారు. రాష్ట్రంలోని 35ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు కొండా నాగవెంకటేశ్వరరావు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల నాయకులు సీహెచ్ రవికిరణ్, మహేష్, సురేష్, రమేష్, జి.మురళీ, అన్నపూర్ణపాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పశుదాణా పంపిణీ

మలికిపురం, ఆగస్టు 3: వరద ప్రభావిత రామరాజులంకలో 70మంది పాడి రైతులకు నాలుగు టన్నులు, దిండిలో 16మంది రైతులకు ఒక టన్ను దాణామృతాన్ని ఎంపీపీ ఎంవీ సత్యవాణి పంపిణీ చేశారు. కార్యక్రమలో సర్పంచ్‌లు కాకర శ్రీనివాస్, ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీ తాడి దుర్గ, కట్టా భాస్కరరావు, పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

కాపుల సమావేశాన్ని విజయవంతం చేయండి

రాయవరం, ఆగస్టు 3: కాపులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు సెప్టెంబరు 1న మండపేటలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు అధ్యక్షుడు వాదా ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం రాయవరంలో కాపునేతలు మాట్లాడుతూ 56ఏళ్లుగా కాపులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తున్నామని, సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మండపేటలో జరిగే సమావేశానికి అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులను ఆహ్వానించిన, సత్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గాదంశెట్టి కొండలరావు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, కాపునాడు మండలాధ్యక్షుడు నున్న వెంకటరమణ, దేవిశెట్టి చిన్ని, మల్లిపాల గోవిందు, దేవిశెట్టి రాజారావు, కొమిరిశెట్టి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.